క్లుప్తంగా

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి

సోమశిల: అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి ఉద్యోగ విరమణ సభను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కాంట్రాక్టర్ ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డితో పాటు సహచర ఉపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి దంపతులను శాలువాలతో సన్మానించారు. తెలుగు ఉపాధ్యాయుడిగా వెంకటేశ్వరరెడ్డి అందించిన సేవలను కొనియాడారు. ఆయన శేష జీవితం సుఖంగా సాగాలని ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బిజివేముల పిచ్చిరెడ్డి, వైఎస్సార్ టీఏ రాష్ట్ర కార్యదర్శి మెట్టుకూరు సుబ్బారెడ్డి, నాయకులు ఎద్దల శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి సంతాపం

కావలి (జలదంకి): కావలి మున్సిపాలిటీ పరిధిలోని నాల్గో వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు యారం బ్రహ్మారెడ్డి ఆదివారం మృతి చెందారు. ఆయన మృతిపై కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బ్రహ్మారెడ్డి పార్టీ కోసం అహర్నిశలు కష్టపడ్డారని, ఆయన మరణం పార్టీకి తీరని లోటన్నారు. ఆయన మరణం పార్టీ నాయకులు, కార్యకర్తలను తీవ్రంగా కలచివేసిందన్నారు. బ్రహ్మారెడ్డి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని దేవుడ్ని వేడుకుంటున్నామన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ నేతల పర్యటన

సోమశిల: అనంతసాగరం మండలంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, టీ కల్పలతారెడ్డి సోమవారం పర్యటించనున్నారు. టీజేఎస్ ఉన్నత పాఠశాలలో జరిగే వైఎస్సార్‌టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, ఉపాధ్యాయుడు మెట్టుకూరు సుబ్బారెడ్డి ఉద్యోగ విరమణ సభలో పాల్గొననున్నారు. వారితో పాటు జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి, ప్రముఖ కాంట్రాక్టర్ ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొననున్నట్లు ఉపాధ్యాయుడు సుబ్బారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట మండలం రాజవోలులోని ఎడ్వమ్మ మెమోరియల్ చర్చి ఆవరణలో ఎడ్వమ్మ మెమోరియల్ క్రిస్టియన్ ఫౌండేషన్ నిర్వాహకులు పీ ఎడ్వర్డ్ పేదలకు నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. చర్చి పాస్టర్ జాషువా విజ్ఞప్తి పేదలకు నిత్యావసర సరుకులను అందజేశారు.

ముగిసిన నాగార్పమ్మ ఉత్సవాలు



ఉదయగిరి రూరల్: మండలంలోని సున్నంవారిచింతలలో జరుగుతున్న నాగార్పమ్మ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరిరోజు భక్తులు పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా రామాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగారప్పమ్మ ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి ట్రాక్టర్‌పై కొలువుదీర్చి ఊరేగింపుగా గ్రామ సమీపంలోని వనంతోపు వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

చెలరేగిపోతున్న గ్రావెల్‌మాఫియా

- ఎమ్మెల్యే సిఫార్సు లేఖల పేరుతో అడ్డగోలుగా దోపిడీ
- ఇరిగేషన్ అధికారులు అడ్డుకున్నా లెక్కచేయని వైనం
- అక్రమార్కులకు సహకరిస్తున్నట్లుగా పోలీసులపైన ఆరోపణలు

నేతల అండ.. గ్రావెల్ దందా

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలో గ్రావెల్ మాఫియా చెలరేగిపోతోంది. ఎమ్మెల్యే సిఫార్సు లేఖలను అడ్డం పెట్టుకుని పెద్ద ఎత్తున గ్రావెల్ దందాను సాగిస్తున్నారు. చెరువులు, ప్రభుత్వ, పొరంబోకు భూముల నుంచి అనుమతులు లేకుండానే రేయింబవళ్లు గ్రావెల్‌ను తరలిస్తూ రూ.లక్షల్లో అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో రావాల్సిన ఆదాయానికి గండికొడుతూ జేబులు నింపుకొంటున్నారు. కొన్నిచోట్ల అక్రమ మట్టి తరలింపును ఇరిగేషన్ అధికారులు అడ్డుకుంటున్నా పోలీసులు 'ఎమ్మెల్యే కార్యాలయం నుంచి సిఫార్సు లేఖ వచ్చింది.. ఎమ్మెల్యేనే ధిక్కరిస్తూ ఫిర్యాదు చేస్తారా..అయితే ఇవ్వండి' అంటూ బెదిరింపు ధోరణితో హెచ్చరిస్తుండడంతో వారు ఫిర్యాదు చేసేందుకు జంకుతున్నారు. దీంతో గ్రావెల్ మాఫియా దందా వెనుక పోలీసుల పాత్ర కూడా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వింజమూరు మండలంలోని చెరువులపై కన్నేసిన గ్రావెల్ మాఫియా అనుమతుల్లేకుండానే జేసీబీలతో పెద్దఎత్తున గ్రావెల్ తవ్వకాలు సాగిస్తోంది. వింజమూరు, కలిగిరి మండలాల్లోని లేఅవుట్లకు ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ట్రాక్టర్ ట్రక్కుకు రూ.800, టిప్పరుకు రూ.3500 చొప్పున వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వింజమూరులోని మల్లపురాజువాగు చెరువు, పాతూరు చెరువు, యర్రబల్లిచెరువు, నందిగుంట చెరువుల నుంచి రాత్రి వేళల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ఈ వ్యవహారం వెనుక ఓ టిప్పర్ ఓనర్ రింగ్ మాస్టర్‌గా వ్యవహరిస్తున్నట్లుగా సమాచారం. అతను అందరిని మ్యానేజ్ చేస్తున్నట్లుగా స్థానికులు చెబుతున్నారు. టిప్పర్ ఓనర్‌కు, ఓ పోలీసు అధికారికి మధ్య సన్నిహిత సంబంధాలు ఉండడంతో గ్రావెల్‌దందా సాఫీగా సాగుతున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం వెనుక ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం సహకారం ఉందనే విమర్శలు కూడా బహిరంగంగా వినిపిస్తున్నాయి.

ఎమ్మెల్యే పాత్ర ఎంత..?

ఉదయగిరి నియోజకవర్గంలో ఎక్కడైనా ప్రజలు తమ అవసరాలు కోసం మట్టి తరలిస్తుంటే వెంటనే పోలీసులు వాలిపోతున్నారు. వాహనాలను సీజ్ చేస్తున్నారు. అధికార పార్టీ నేతలు సైతం తమ అవసరాల కోసం మట్టి తరలించే పరిస్థితి కనిపించడం లేదు. స్థానిక నాయకులు పోలీసులను ప్రశ్నిస్తే ఎమ్మెల్యే నుంచి లేఖ తెచ్చుకోండి అని చెబుతున్నట్లుగా వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన తమకే ఈ పరిస్థితి ఉంటే సామాన్యుల మట్టి అవసరాలు ఎలా తీరుతాయని ప్రశ్నిస్తున్నారు. కాగా ఎమ్మెల్యే కాకర్ల సైతం మట్టి మాఫియాలను మాత్రమే అడ్డుకోవాలని, సామాన్యులను ఇబ్బందిపెట్టొద్దని అధికారులకు చెబుతున్నారు. మరి ఎమ్మెల్యే సిఫార్సు లేఖల పేరుతో సాగిస్తున్న గ్రావెల్ దందా వ్యవహారంలో ఎవరి పాత్ర ఉందనే విషయంలో సందిగ్ధత నెలకొంది. ఈ విషయం స్పష్టత లేక అధికార పార్టీ నేతలతో పాటు ఇరిగేషన్ అధికారులు సైతం తలలు పట్టుకుంటున్నారు. మరి వాస్తవం ఏమిటో ఎమ్మెల్యే కార్యాలయమే స్పష్టత ఇవ్వాల్సి ఉంది.అక్రమ గ్రావెల్ దందాను అడ్డుకుంటామని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. స్థానికులు ఒత్తిడి చేసిన చోట పోలీసులకు ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేస్తున్నా వారి నుంచి సహకారం అందడం లేదని ఏఈ మహేంద్ర చెబుతున్నారు.



వింజమూరులోని చెరువులో ట్రాక్టర్‌కు గ్రావెల్‌ను లోడ్ చేస్తున్న జేసీబీ



నందిగుంట చెరువులో గ్రావెల్‌ను తరలిస్తున్న ట్రాక్టర్లు



ఎమ్మెల్యే చెప్పారంటూ గ్రావెల్ మాఫియా చూపిస్తున్న లేఖ

ప్రభుత్వం ఆదాయానికి గండి

గ్రావెల్ తవ్వకాలకు అనుమతి పొందిన వారు క్యూబిక్ మీటరు మట్టికి గనుల శాఖకు రూ.46, ఇరిగేషన్ శాఖకు రూ.136 చొప్పున ట్రాక్టర్ ట్రక్కుకు రూ.450 రాయల్టీ రూపంలో చెల్లించాలి. అయితే గ్రావెల్ మాఫియా అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి సైతం గండి కొడుతోంది. చెరువుల్లో గ్రావెల్ తవ్వకాలకు అనుమతి పొందిన వారు ప్రభుత్వ నిబంధనల మేరకు పైపైన తవ్వకాలు చేపట్టాలి. కానీ గ్రావెల్‌మాఫియా ఇటీవల కొద్దిరోజులుగా రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా చెరువుల్లో పెద్దపెద్ద గుంతలు తీసి గ్రావెల్ తవ్వకాలు సాగిస్తోంది. దీంతో వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలిచి చిన్నారులు, పశువులు మృత్యువాత పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జలదంకి మండలంలో జోరుగా...

జలదంకి: మండలంలో గ్రావెల్ అక్రమ రవాణా జోరందుకుంది. కొందరు చెరువుల నుంచి రాత్రి వేళల్లో గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. జలదంకి, జమ్మలపాళెం, చోడవరం, రామవరప్పాడు, గట్టుపల్లి, తదితర గ్రామాల్లోని చెరువులతో పాటు బోయిలపాడు తిప్ప నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. రైతు పేరిట ఒక ట్రాక్టర్ గ్రావెల్‌కు పర్మిషన్ తీసుకుని రాత్రి వేళల్లో జేసీబీలు పెట్టి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా మట్టిని ఇటుకబట్టీలు, గ్రావెల్‌ను లేఅవుట్లకు పెద్ద ఎత్తున తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారు. ఆదివారం అధికారులు ఉండరనే ధీమాతో జమ్మలపాళెం, చోడవరం చెరువుల నుంచి జోరుగా గ్రావెల్ అక్రమ రవాణా చేపట్టారు. గ్రావెల్ అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు స్పందించి గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



జమ్మలపాళెం చెరువు నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

వైభవంగా అచ్చమాంబ బ్రహ్మోత్సవాలు



విశేషాలంకారంలో అచ్చమాంబ అమ్మవారు



పొంగళ్లు పెడుతున్న మహిళలు

మర్రిపాడు: మండలంలోని పొంగూరు మాలిచేలో కొలువైన అచ్చమాంబ పేరంటాళ్ల అమ్మవారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు ఆదివారం అమ్మవారికి విశేషాలంకరణలు, పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు పొంగళ్ల సామగ్రిని కొత్తబుట్టల్లో పెట్టుకుని ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సమీప గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ వద్ద కోలాహలం నెలకొంది. ఆత్మకూరు సీఐ గంగాధర్ పర్యవేక్షణలో ఎస్సై శ్రీనివాసరావు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గ్రామస్వరాజ్యానికి కూటమి ప్రభుత్వం తూట్లు



కలెక్టర్‌కు ఇవ్వనున్న వినతిపత్రాన్ని చూపుతున్న సర్పంచ్‌లు, నాయకులు

ఆత్మకూరు: గాంధీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని తీసుకురావాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంకల్పిస్తే, అందుకు తూట్లు పొడిచేలా ప్రస్తుత కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని వైఎస్సార్సీపీ పంచాయతీరాజ్ విభాగం ఆత్మకూరు నియోజకవర్గ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పలువురు సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఉపాధి హామీ పనులు అవినీతిమయంగా జరుగుతున్నాయన్నారు. పంచాయతీ తీర్మానాలు లేకుండానే పనులు చేపడుతూ దోచుకుంటున్నారని ఆరోపించారు. ఉపాధి పనులపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు సైతం సకాలంలో వేతనాలు చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌లకు రాజ్యాంగ చట్టప్రకారం కల్పించిన హక్కులను కాలరాసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1150 కోట్లను దారి మళ్లించారని, వెంటనే గ్రామాల అభివృద్ధికి పంచాయతీ ఖాతాల్లో నిధులు జమ చేయాలని కోరారు. గ్రామాల్లో వసూలు చేస్తున్న ఇంటి పన్నులను పంచాయతీల నిధుల్లో జమ చేయాలన్నారు. సర్పంచ్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు గౌరవవేతనాలు పెంచాలని, బకాయిలను చెల్లించాలని కోరారు. తల్లికి వందనం పథకాన్ని సర్పంచ్‌ల కుటుంబాలకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో ఎందరో పేదలైన దళిత వర్గాలకు చెందిన సర్పంచ్‌లు తల్లికి వందనం పథకం అందుకోలేని పరిస్థితిని కల్పించడం దారుణమన్నారు. ఏడాది కాలానికి టీడీపీ ప్రభుత్వం రెండు హామీలను అమలు చేసిందని, ఇచ్చిన 143 హామీలు అమలు కావాలంటే ఎన్నేళ్ల సమయం పడుతుందని ఆయన ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనల మేరకు పంచాయతీ వ్యవహారాల్లో జరుగుతున్న అవకతవకలపై పార్టీ నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు సూరం ప్రసాద్‌రెడ్డి, బొలిగర్ల వెంకటేశ్వర్లు, మాలేపాటి సతీష్, పార్టీ నాయకులు దాడి శ్రీనివాసులునాయుడు, బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి, సుమంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిగా రఫీ సేవలు ఎనలేనివి



రఫీని సత్కరిస్తున్న జేడీ రామలింగం

ఉదయగిరి: ఉపాధ్యాయుడిగా షేక్ రఫీ అందించిన సేవలు ఎనలేనివని పలువురు వక్తలు కొనియాడారు. ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు షేక్ రఫీ ఉద్యోగ విరమణ సభను స్థానిక అల్‌ఖైర్ ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఆయన విద్యాభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. అనంతరం రఫీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం, జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య, మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక అధికారులు, రాజకీయ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ పట్టణాధ్యక్షుడిగా శేషాద్రి



శేషాద్రిని అభినందిస్తున్న నాయకులు

ఆత్మకూరు: బీఎస్పీ పట్టణాధ్యక్షుడిగా బుర్రా శేషాద్రి ఎంపికయ్యారు. ఆత్మకూరు నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ సమావేశాన్ని పట్టణంలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పెనగలూరు మహేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు పుష్పాంజలి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జూలై 6న విజయవాడలో బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. అనంతరం ఆత్మకూరు పట్టణాధ్యక్షుడిగా బుర్రా శేషాద్రిని ప్రకటించారు. ఈ సమావేశంలో రామకృష్ణ, రాహుల్, వెంకటేశ్వర్లు, రమేష్, టంగుటూరి రవికుమార్, తేనేటి రవి, తదితరులు పాల్గొన్నారు.

హైవేపై ఇసుక తొలగింపు



సంగంలో పెన్నా బ్రిడ్జిపై ఇసుక తొలగింపును పరిశీలిస్తున్న ఎస్సై రాజేష్



ఆత్మకూరులో హైవేపై ఇసుక తొలగింపు

ఆత్మకూరు/సంగం: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఏఎస్‌పేట అడ్డరోడ్డు వద్ద హైవేపై పేరుకుపోయిన ఇసుకను ఆదివారం తొలగించారు. ఇటీవల ఏఎస్‌పేట అడ్డరోడ్డు వద్ద వరుసగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఆత్మకూరు ఎంవీఐ రాములు వాహనచోదకులు ప్రమాదాలకు గురికాకుండా ఇసుకను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. డేంజర్ జోన్‌ను గుర్తించేలా 500మీటర్ల దూరంలో బోర్డులను సైతం ఏర్పాటు చేశారు. అలాగే సంగంలోని పెన్నానది బ్రిడ్జి, జాతీయ రహదారిపై ఇసుక పేరుకుపోయి వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రాజేష్ ఆధ్వర్యంలో తొలగించారు.

పట్టణ ప్రజల సహకారంతో పండగలా కుంభాభిషేకం



ఆత్మకూరు: పట్టణ ప్రజల సహకారంతో అలఘునాథస్వామి పుష్కర కుంభాభిషేక మహోత్సవాన్ని పండగలా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయాన్ని పునర్నిర్మించి 12 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఆగస్టు 5, 6, 7 తేదీల్లో పుష్కర కుంభాభిషేకాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఆలయ ప్రాంగణంలోని నూతన కల్యాణ మండపంలో మహిళలతో సన్నాహక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మహిళలు కుంభాభిషేకంలో పాల్గొని నిర్దేశించిన పనులను చేయాలని కోరారు. పట్టణ ప్రజలు కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ యానాదిరెడ్డి, అన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి, కేవీ శేషారెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, పూజారి శ్రీనివాస్ శర్మ, రామయ్యస్వామి, సుబ్బానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రెవెన్యూ క్రీడలు ప్రారంభం



రెవెన్యూ క్రీడా పోటీలను త్రోబాల్ వేసి ప్రారంభిస్తున్న తహసీల్దార్ పద్మజాకుమారి

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ స్థాయి రెవెన్యూ క్రీడా పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాలకు చెందిన సుమారు 300 మంది రెవెన్యూ సిబ్బంది ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. ఆత్మకూరు తహసీల్దార్ పద్మజాకుమారి త్రోబాల్ వేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడా పోటీలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు. వృత్తిపరంగా ఒత్తిడికి గురయ్యే రెవెన్యూ ఉద్యోగులు కొంత ఉపశమనం పొందేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. రెవెన్యూ క్రీడల్లో ప్రతి రెవెన్యూ ఉద్యోగి తప్పనిసరిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. పోటీతత్వంతో పాటు స్నేహపూర్వకంగా క్రీడల్లో పాల్గొన్న ప్రతిఒక్కరూ విజయం సాధించినట్లేనన్నారు. కాగా వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, బాస్కెట్ బాల్, అథ్లెటిక్స్, తదితర క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పాఠశాల పీడీ తిరుపతయ్య తెలిపారు. తహసీల్దార్లు సోమ్లానాయక్, బీ మురళి, అనిల్‌కుమార్, డీటీలు, తదితరులు పాల్గొన్నారు.